క్లుప్తంగా

నేడు తెనాలిలో లోక్ కల్యాణ మేళా

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక కుటుంబం -ఒక వ్యాపారవేత కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో లోక్ కళ్యాణ మేళాను నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో ప్రధానమంత్రి స్వానిధి 2.0 పథకం కింద కొత్త రుణాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించడం, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాసెస్ చేయిచడం, పెండింగ్‌లో రుణాలను మంజూరు చేయించడం వంటివి చేయనున్నట్లు చెప్పారు. వివిధ బ్యాంకు అధికారులు దీనిలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం వీధి విక్రయదారులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందని వివరించారు.

25న ఉచిత వైద్య శిబిరం

తెనాలిరూరల్: ఫ్రూట్ మినిస్ట్రీస్, సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 'కడవరికాల సందేశం' ఆధ్యాత్మిక మాస పత్రిక 26వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 25న పెదరావూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఫ్రూట్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు రెవ. తుమ్మల ప్రశాంత రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీ, కంటి పరీక్షలు, అన్ని రకముల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచతంగా ఇస్తారన్నారు. పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, చినరావూరు, చినరావూరుతోట ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మోదీ నిర్ణయం దేశ ప్రజలకు ఎంతో మేలు

తెనాలిటౌన్: జీఎస్టీ రేటులు తగ్గించడం దేశ ప్రజలకు ఎంతో మేలు చేసినట్లని ప్రధాని మోడీ నిర్ణయాలు యావత్తు భారతదేశానికి మంచి భవిష్యత్తును నిర్దేశిస్తున్నాయని బీజేపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు పేర్కొన్నారు. స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహా సెంటర్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ చిత్రపటానికి ఆ పార్టీ నేతలు పాలాభిషేకం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు, పేద, మధ్య తరగతి ప్రజలకు, చిరు వ్యాపారులకు ఊరట కలిగించే అంశంగా తెలిపారు. ప్రధాని మోడీ తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలు యువత, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్లు అని కొనియాడారు. ప్రజలు కొనుగోలు శక్తిని సులభతరం చేస్తూ ఆర్థికభారం తగ్గించారని వెల్లడించారు. అనంతరం తయారమ్మ వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సందీప్, టి.అనంతాచార్యులు, డి.జార్జి, వీరయ్య, జి.పూర్ణచంద్ర రావు ఉన్నారు.

మున్సిపల్ కార్యాలయ తరలింపు పనులు ప్రారంభం



తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయ తరలింపు పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ భవనం శిథిలావస్థకు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మార్కెట్ భవనంలోని రెండు, మూడోవ అంతస్తులో దీనిని మార్పు చేసేందుకు కావాల్సిన ఆధునీకరణ పనులుపూర్తి చేశారు. సోమవారం కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన రికార్డులను నూతన భవనంలోని పంపారు. వారంలోపు పూర్తిగా పాత భవనాన్ని ఖాళీ చేయనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.

మల వ్యర్థాలు రోడ్లపై వేయవద్దు

మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు



మాట్లాడుతున్న ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు

తెనాలిఅర్బన్: మల వ్యర్థాలను రోడ్లపై పారబోయవద్దని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు సూచించారు. పట్టణంలోని సెప్టిక్ ట్యాంకు నిర్వాహకులతో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల వెంట సెప్టిక్ ట్యాంక్ పోస్తున్నారనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ఎవరు అలా చేయవద్దని, పూలే కాలనీలో నూతనంగా నిర్మించిన ఎస్‌టీపీ ప్లాంట్‌లో వాటిని పోయాలని సూచించారు. అధికారుల సూచనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మారీసుపేట శ్రీకోదండరామస్వామి ఆలయంలో అమ్మవారు



మారీసుపేట శివాలయంలో స్వర్ణకవచాలంకృత శ్రీబాలాత్రిపురసుందరి అలంకారం



దేవీచౌక్‌లో ఆలయంలో శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకారం



బాలాత్రిపురసుందరిగా శ్రీపర్వతవర్ధినీ అమ్మవారు



శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు

ఆరంభమైన శరన్నవరాత్రి మహోత్సవాలు



సాంస్కృతిక ప్రదర్శన



విద్యుత్ వెలుగుల్లో శ్రీవాసవీ దేవాలయం

తెనాలి: దసరా పర్వదినం సందర్భంగా ఆంధ్రాప్యారిస్ తెనాలిలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ఆరంభమయ్యాయి. దేవాలయాలు విద్యుత్‌దీపాల వెలుగులో శోభిల్లుతున్నాయి. ప్రతి ఆలయంలోనూ అమ్మవారు ప్రత్యేక అలంకరాలతో భక్తులకు దర్శనమిచ్చారు. విజయదశమి రోజు వరకు రోజుకో అలంకారంతో అమ్మవారిని అలంకరిస్తారని తెలిసిందే. దీనితోపాటు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక అంశాలను ప్రదర్శిస్తారు. ఈ క్రమంలో స్థానిక మారీసుపేటలో వేంచేసి ఉన్న శ్రీకోదండరామస్వామి వారి దేవస్థానంలో (రామభక్త అప్పలస్వామి గుడి)లో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రాత కాలపూజ, గణపతి పూజ అఖండ స్థాపన, పుణ్యవచనం, కంకణ ధారణ, అంకురారోపణ, కలస స్థాపన, మండపారాధన తదుపరి సహస్రనామార్చన, భక్తులచే సామూహిక కుంకుమార్చన చేశారు. ధర్మకర్తలు లంక శివానంద కుమార్, కునపల్లి నారాయణస్వామి, లంక శివ ఆంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో దేవాలయ ప్రధాన అర్చకులు దినమని. ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ పూజలు నిర్వహించారు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు, మారీసుపేటలోని శివాలయంలో అమ్మవారికి స్వర్ణకవచలంకృత శ్రీబాలాత్రిపురసుందరిగా ప్రత్యేక అలంకారం చేశారు. పట్టణ దేవీచౌక్‌లోని శ్రీరాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు ఉత్సవాల తొలిరోజున శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీదుర్గాభవాని నాట్యమండలి, తెనాలి వారిచే గయోపాఖ్యానం (యుద్ధసీను); శ్రీరామాంజనేయ యుద్ధం(యుద్ధసీను) ప్రదర్శించారు. కమిటీ చైర్మన్ టీవీఎస్ శాస్త్రి, ఇతర పాలకవర్గ బాధ్యులు పర్యవేక్షించారు. గంగానమ్మపేటలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో శ్రీపర్వతవర్ధినీ దేవికి శ్రీబాలాత్రిపురసుందరి అలంకారం చేశారు. ధర్మకర్త కె.భాస్కరరావు, కార్యనిర్వహణ అధికారి వీవీ రమణకుమారి పర్యవేక్షించారు. పట్టణ రామలింగేశ్వరపేటలోని శ్రీగంగాపార్వతి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్ పర్యవేక్షించారు. గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో దసరా ఉత్సవాలు ఆరంభించారు. తొలి రోజున అమ్మవారి శ్రీబాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. చైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిటౌన్: దేవి శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో శ్రీ కనకదుర్గదేవి ఆలయం నందు సోమవారం తొలిరోజు అమ్మవారి బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కొలకలూరు శ్రీనివాసశర్మ, కొలకలూరు శివ శర్మ, మురికిపూడి విశ్వనాథ్, మురికిపూడి మురళి, తదితరులు ఉన్నారు. మండలంలోని కఠెవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారిని బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు జాజుల వెంకటేశ్వరరావు, జాజుల జగదీష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ....

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని సుప్రసిద్ధ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం వైభవంగా ఆరంభమయ్యాయి. ఆలయ కమిటీ వివాదం నేపథ్యంలో పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, 'డబుల్ హార్స్' అధినేత మునగాల మోహన్‌శ్యాంప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ కార్యకలాపాలు జరుగుతున్న విషయం తెలిసిందే. తొలిరోజున శ్రీవాసవి అమ్మవారిని శ్రీబాలాత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదే ఆలయ ప్రాంగణంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి శ్రీమహాగౌరి అలంకారం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు నుదురుపాటి రామకోటేశ్వరశర్మ పూజలు చేయగా, చావలి హనుమకుమార్ అమ్మవార్ల అలంకారాలను చేశారు.

వనదుర్గ సహిత నవచండీహోమం...

ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రీతిగా లోకక్షేమం కోసం వనదుర్గ (మహావిద్య) యాగ సహిత నవచండీ యాగం చేపట్టారు. ఉదయం 8 గంటల్నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అక్టోబరు ఒకటో తేదీవరకు ప్రతిరోజూ ఇదే సమయానికి శ్రీవిద్య ఉపాసకులు, వేదపండితుడు బ్రహ్మశ్రీ చింతపల్లి శ్రీదత్తశర్మ ఆధ్వర్యంలో వనదుర్గ సహిత నవచండీహోమం జరుగుతుందని భక్తులు, ఈ పూజాకార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ బాధ్యులు కోరారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాల వెలుగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

శ్రీకాళీమాత దేవస్థానంలో...



బాలాత్రిపురసుందరిగా కాళీమాత

తెనాలి: పట్టణ శివాజీచౌక్‌లోని శ్రీకాళీమాత దేవస్థానంలో దసరా నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఆరంభమయ్యాయి. తొలిరోజున అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీనటరాజ నృత్య కళానికేతన్ నృత్యగురువు నిర్మలా రమేష్ శిష్యబృందం కూచిపూడి-జానపద నృత్యాంశాలను ప్రదర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ పర్యవేక్షించారు.



శ్రీవిద్యాపీఠంలో...



నందివెలుగు శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు



కఠెవరం శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బాలత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు



శ్రీబాలాత్రిపురసుందరిగా శ్రీవాసవీ అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో వనదుర్గ

కార్యకర్తలకు తగిన గుర్తింపు

పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శివకుమార్



మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌తో పార్టీ నేతలు

తెనాలి: వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పార్టీలో కొత్తగా పదవులు పొందినవారు, బాధ్యతాయుతంగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటూ పార్టీ విధానాలను, కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పార్టీలో కొల్లిపర మండలంలోని వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను పార్టీ నియమించింది. పార్టీ కొల్లిపర మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ఈద యశ్వంత్ రెడ్డి, అదే మండలం మహిళా విభాగం అధ్యక్షురాలుగా తమ్మ సుజాత రెడ్డి, బీసీ విభాగం అధ్యక్షుడిగా ఉయ్యూరు గోపీ నియమితులయ్యారు. సోమవారం వీరు తెనాలిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ పలు అంశాలను వారికి సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో నిర్మాణాత్మకంగా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చంచల రామిరెడ్డి, గొర్రెపాటి వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు గోపి, షేక్ దుబాయ్ బాబు, కుర్రా జస్వంత్ యాదవ్, యాతాటి అనిల్, ఉన్నవ హనీష్, నాలాది బుజ్జిబాబు, కోడూరి నాగమల్లేశ్వరరావు, అక్కిదాసు కిరణ్ కుమార్, సిద్ధబత్తుని జయప్రద, ఎరుకలపూడి శాంతకుమారి పాల్గొన్నారు.

సమాధుల తోటల్లో స్థలాల ఆక్రమణపై దృష్టి సారించండి

సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన బీఎస్పీ నేత సునీల్‌సందీప్



సబ్‌కలెక్టర్‌కు అర్జీని అందజేస్తున్న నాయకులు

తెనాలి: శ్మశానవాటికల్లో స్థల ఆక్రమణలపై అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాలని బహుజన సమాజ్ పార్టీ తెనాలి నియోజకవర్గ అధ్యక్షుడు కారుమంచి సునీల్‌సందీప్ అన్నారు. స్థానిక అయితానగర్ క్రైస్తవ సమాధుల్లో స్థలం అన్యాక్రాంతంపై సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ వి.సంజన సింహకు వినతిపత్రం సమర్పించారు. క్రైస్తవులకు అత్యంత అవసరమైన శ్మశానవాటికలో స్థలం లేనందున ప్రభుత్వం తక్షణమే స్థలం ఏర్పాటుచేయాలని కోరారు. సమాధులను ఇష్టానుసారం నిర్మించటం పేదలను అవమానపర్చడమేనని అన్నారు. ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో స్థలాలు కొరత ఏర్పడుతుందని పలువురు సమాధులను అక్రమిస్తున్నారని ఆరోపించారు. పెద్ద భవంతులు లాంటి సమాధులను నిర్మించి తమ హోదాను చూపించడం సరికాదన్నారు. మృతదేహానికి సరిపడ స్థలాన్ని కేటాయించేవిధంగా జీవో తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆక్రమణలను ఖాళీచేయించాలనీ, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. క్రైస్తవలకు కేటాయించిన శ్మశానవాటిక స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా వాటి వివరాలను మున్సిపల్ రికార్డుల్లో పొందుపరచాలన్నారు. అర్జీని సమర్పించిన కార్యక్రమంలో న్యాయవాదులు గుంటి సురేష్, కంచర్ల కోటేశ్వర రావు, గడ్డేటి ప్రకాష్ బాబు, పిల్లి దాసు, వంపుగళ్ల మహేంద్ర, బొనిగల దీనరాజ్, చింతా మణివరన్, బొనిగల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో మొత్తం 15 అర్జీలు...

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో మొత్తం 15 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ పరిధిలోనివి అయిదు కాగా, మున్సిపాలిటీ విభాగానికి చెందినవి నాలుగు, ట్రెజరీ అంశంపై రెండు, పంచాయతీరాజ్ విభాగం, జిల్లాపరిషత్ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ, రైల్వేకు సంబంధించిన అంశాలపై ఒక్కోటి చొప్పున అర్జీలను అందజేశారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

అంబియంట్ స్కూల్లో దసరా వేడుకలు

తెనాలిఅర్బన్: దసరా వేడుకలను చెంచుపేటలోని అంబియంట్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రధారణతో పాఠశాలకు వచ్చి అందరిని అలరించారు. విద్యార్థినీలు చేసిన కోలాటం పలువురుని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇర్షాద్, డైరెక్టర్ సల్మా, ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

రేపు మహిళలకు సీహెచ్‌సీలో వైద్య శిబిరం

కొల్లిపర: అసంక్రమిత వ్యాధుల నివారణ కోసం, మహిళలు ఆరోగ్యవంతులుగా ఉండటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్థ్ అభియాన్ పథకం ద్వారా బుధవారం కొల్లిపర గ్రామంలోని సీహెచ్‌సీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మహిళలకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణి తెలిపారు. సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో మహిళలకు ఉచితంగా రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, తల్లి బిడ్డ సేవలు, వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్ , మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలు అందించనున్నట్లు తెలిపారు.అంటే కాకుండా వైద్య సిబిరంలో గైనకాలజిస్టు , జనరల్ సర్జరీ, దంత వైద్యంకు ప్రత్యేక సీనియర్ వైద్యులు ఉంటారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ముఖ్యంగా రక్తదానం శిబిరం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చినకాకానిలో డెంగీ కేసు నమోదు

మంగళగిరి: చినకాకాని హాయ్‌ల్యాండ్ రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో జ్వరంతో బాధపడుతున్న వ్యక్తికి డెంగీ అని తేలడంతో స్థానికులు కలవరపడ్డారు. నగర కమిషనర్ అలీం బాషా సోమవారం డెంగీ సోకిన వ్యక్తిని పరిశీలించారు. స్థానికంగా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

'సీపీఆర్'పై ఫార్మసీ విద్యార్థులకు శిక్షణ



డాక్టర్ సత్యనారాయణకు జ్ఞాపిక బహూకరిస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజిలో సోమవారం ఎవరికైనా గుండె పోటు సంభవించినపుడు తక్షణమే చేయాల్సిన 'సీపీఆర్' (కార్డియో పల్మొనరీ రెసిస్టికేషన్)పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యవసర వైద్యనిపుణుడు డాక్టర్ వీవీ సత్యనారాయణ ముఖ్యఅతిధిగా హాజరై అకస్మాత్తుగా గుండె ఆగిపోవటం, శ్వాస ఆగిపోవటం వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి ఉపయోగపడే ప్రాధమిక పద్ధతులను విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా తెలియజేశారు. వీటిలో భాగంగా ఛాతీపై ఒత్తిడి, కృత్రిమ శ్వాస, అత్యవసర సేవల సమాచారం వంటి అంశాలను ప్రత్యక్ష ప్రదర్శనలతో నేర్పించారు. ఈ నైపుణ్యం కలిగిన ప్రతిఒక్కరికీ అత్యవసర సమయాల్లో ప్రాణాలను రక్షించే శక్తిని ఇస్తుందని తెలిపారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజానికి ఉపయోగపడే శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని, భవిష్యత్‌లో ఇలాంటి సామాజిక అవసరాలపై మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఐపీఏ ఎస్ఎఫ్ ఏఎస్ఎన్ చాప్టర్ మెంటారు పి.భార్గవి, ఎన్ఎస్ఎస్ 1,2 విభాగాల ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జ్యోతిబసు, కె.కళ్యాణ్‌చక్రవర్తి పర్యవేక్షించారు. డాక్టర్ సత్యనారాయణకు జ్ఞాపికను బహూకరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వలు, రహదారులను నిర్మించండి



ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ జయపాల్

తెనాలిఅర్బన్: మురుగుకాల్వలు, రోడ్ల నిర్మాణం జరగక ఆ ప్రాంతవాసులు అనేక ఇబ్బందులుపడుతున్నారని 31,32 వ వార్డు ప్రజలు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ పి.శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. చెంచుపేటలో కాల్వ నిర్మాణాలు జరిపారని, ఆ సమయంలో వచ్చిన మట్టిని అక్కడే వదిలేశారని, వెంటనే దానిని తొలగించాలని సీపీఎం నాయకులు కెబి.ప్రసాద్, షేక్ హుస్సేన్ వలీ, వై.ఆశోక్ కుమార్‌లు కోరారు. 1వ వార్డులో స్మశానవాటికకు స్థలం కేటాయించాలని, 24వ వార్డులో అక్రమణలు తొలగించాలని పలువురు వినతిపత్రాలు ఇచ్చారు. అన్నింటిని పరిశీలించి చర్యలు తీసుకుటామని ఇన్‌చార్జి కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

తెనాలిరూరల్: భారీ వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలుతున్న నేపధ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని తహసీల్దార్ గోపాలకృష్ణ సూచించారు. ఎంపీడీవో అత్తోట దీప్తితో కలసి మండలంలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, సచివాలయ సిబ్బందితో సోమవారం తహసీల్దార్‌సమావేశం నిర్వహించారు. మండలంలోని అంగులకుదురు గ్రామంలో కలరా కేసు నమోదైన నేపధ్యంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్, సిబ్బంది పలు సూచనలు చేశారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చూడాలని, నీళ్ళ ట్యాంకులు శుభ్రం చేయించాలన్నారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించడం అవసరం అని, భోజనం, నీరు మరియు వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.